ఆ మూడు వైద్యశాలలు నకిలీవే..

- ప్రత్యేక తనిఖీల్లో గుర్తించిన టీజీఎంసీ బృందం
- కేసు నమోదు

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): ప్రత్యేక తనిఖీల్లో భాగంగా సిరిసిల్ల, వేములవాడ ప్రాంతాల్లోని మూడు నకిలీ వైద్యశాలలను టీజీఎంసీ సభ్యుడు డాక్టర్ బండారి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో బృందం గుర్తించింది. జిల్లా కేంద్రంలోని గోపాల్‌నగర్‌లో బాబా క్లినిక్ (మాదాసు లక్ష్మణ్), వేములవాడ పట్టణంలోని గాంధీనగర్‌లో అశ్విని క్లినిక్ (రవీందర్), ముస్తాబాద్ మండలం పోతుగల్ రోడ్డులోని ముక్తార్ హాస్పిటల్‌లో ప్రత్యేక దాడులు చేసింది. ఎలాంటి అర్హత లేకున్నా అల్లోపతి వైద్యం చేస్తున్నట్లు తనిఖీల్లో వెలుగుచూసింది. వీరి వద్దకు వచ్చే రోగులకు అవసరం లేకున్నా విచ్చలవిడిగా యాంటీబయోటిక్స్, స్టెరాయిడ్స్ ఇంజక్షన్లు ఇస్తున్నట్లు గుర్తించింది. వీరిపై ఎన్ఎంసీ చట్టం 34, 54 ప్రకారం కేసు నమోదు చేసింది. విద్యార్హత లేకున్నా వైద్యం చేస్తున్నందుకు గానూ క్రిమినల్ కేసు పెడుతున్నట్లు బృందం సభ్యుడు డాక్టర్ బండారి రాజ్‌కుమార్ తెలిపారు. నకిలీ వైద్యుల భరతం పట్టేందుకు గానూ రాష్ట్రవ్యాప్తంగా 30 బృందాల ద్వారా తనిఖీలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

ముస్తాబాద్ మండలం పోతుగల్‌లోని ముక్తార్ దవాఖానలో తనిఖీ చేస్తున్న టీజీఎంసీ బృందం సభ్యులు

రాజన్న గోశాలకు వరి గడ్డి వితరణ

వేములవాడ టౌన్, నవంబర్ 25: వేములవాడ రాజన్న ఆలయానికి సంబంధించిన గోశాలలోని కోడెలు, ఆవులకు సోమవారం పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కన్నాలరాములపల్లికి చెందిన శ్రీ జానకిరామ ట్రాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 20 ట్రాక్టర్ల వరి గడ్డిని వితరణ చేశారు. దీంతో ఆలయ అధికారులు వారిని అభినందించారు.

హలో మాల.. చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ

చందుర్తి, నవంబర్ 25 : హలో మాల.. చలో హైదరాబాద్ పోస్టర్ ను చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో సోమవారం మాల మహానాడు మండల నాయకులు బత్తుల కమలాకర్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. డిసెంబర్ 1వ తేదీన హైదరాబాద్‌లో మాల మహానాడు ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు పెద్ద సంఖ్యలో మాలలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో న్యాత దాసు, రామస్వామి, దేవయ్య, రాజయ్య తదితరులున్నారు.

ఘనంగా నక్షత్ర పూజ

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 25: అల్మాస్‌పూర్‌లో అయ్యప్ప ఆలయంలో నక్షత్ర పూజా కార్యక్రమాన్ని అయ్యప్ప దీక్ష మాలధారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి సుప్రభాత సేవలు, గంధాభిషేకం, భస్మాభిషేకం, పుష్పాభిషేకం, నివేదన కార్యక్రమాలు జరిపారు. ఈ సందర్భంగా పలువురు మాలధారణ స్వీకరించారు. ఇక్కడ శ్రీను గురుస్వామి, తదితరులున్నారు.

మల్యాలలో యూనియన్ బ్యాంక్ ఏర్పాటు

చందుర్తి, నవంబర్ 25 : మల్యాల గ్రామంలో నూతనంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచిని ఏర్పాటు చేస్తూ రీజినల్ కార్యాలయం నుంచి సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. విప్ ఆదిశ్రీనివాస్, కలెక్టర్‌కు మల్యాల గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

తూకంలో మోసాలపై చర్యలు తీసుకోవాలి

కోనరావుపేట, నవంబర్ 25: ధాన్యం తూకంలో మోసాలు చేస్తూ రైతులను దోపిడీ చేస్తున్న రైస్‌మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎర్రవెల్లి నాగరాజు కోరారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ భీమ్యానాయక్‌కు వినతి పత్రం అందజేశారు. రైతుల ధాన్యాన్ని ప్రైవేట్‌గా కొనుగోలు చేస్తూ రైస్‌మిల్లర్లు మోసానికి పాల్పడుతున్నారన్నారు. అదేవిధంగా కొన్ని మిల్లుల్లో ఎలక్ట్రానిక్ కాంటా సరిగా చూపడం లేదని, రైస్ మిల్లుర్లు మోసం చేస్తున్నారని తెలిపారు. మోసాలకు పాల్పడుతున్న రైస్ మిల్లర్లు, నిర్వాహకులపై చర్యలు తీసుకొని, రైతులకు న్యాయం చేయాలని కోరాడు.

కోట్ల ఆదాయం వస్తున్నా సమాచార బోర్డులు కరువు

- రాజన్న ఆలయంలో చినిగిన సమాచార బోర్డులు
- తాతల కాలం నుంచి వేలాడుతున్న కాగితపు బోర్డులు
- పట్టించుకోని అధికారులు
- సమయం, ధరలు తెలియక భక్తుల ఇబ్బందులు

రాజన్న ఆలయానికి కోట్లల్లో ఆదాయం వస్తున్నా కనీసం సమాచార బోర్డులు కనిపించడంలేదు. చాలా రోజుల క్రితం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ బోర్డులు చిరిగిపోయాయి. కాగితపు బోర్డులు వేలాడుతున్నాయి. సేవల వేళలు, ధరలు తెలియక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.



బుకింగ్ కౌంటర్ వద్ద ఏర్పాటు చేసిన కాగితపు అట్టపై రాసిన బోర్డు

ఆలయ ముఖ్య బుకింగ్ కౌంటర్ వద్ద అర్జిత సేవల ధరల వివరాలు తెలియకుండా ఏర్పాటు చేసిన బోర్డు

కోడెల క్యూ వద్ద ఏర్పాటు చేసిన స్వామి వారి అర్జిత సేవల టికెట్ల వివరాలు చినిగిన బోర్డు

వేములవాడ, నవంబర్ 25 : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో అధికారులకు ఆదాయం మీద తప్ప భక్తుల కనీస సౌకర్యాలపై ధ్యాస లేదని విమర్శలు వస్తున్నాయి. రాజన్న సన్నిధికి లక్షలాదిమంది భక్తులు తరలివచ్చి నిత్యం స్వామివారి అర్జిత సేవల్లో పాల్గొంటారు. స్వామివారి నిత్య అర్జిత సేవలను అందించే ముఖ్య బుకింగ్ కౌంటర్ వద్ద వివరాలు తెలిపే బోర్డు కూడా సక్రమంగా లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్వామివారి గర్భాలయంలో నిర్వహించే అభిషేకం, అన్న పూజ, ఆకుల పూజ టికెట్లు ఈ కౌంటర్ ద్వారానే భక్తులకు అందజేస్తుంటారు. అలాగే స్వామివారి నిత్య కల్యాణం, నిత్య సేవలు, సత్యనారాయణ వ్రతం, ఇలా అనేక పూజలు కూడా ఈ కౌంటర్ ద్వారానే భక్తులు టికెట్లు పొందాల్సి ఉంటుంది. ఈ ఆర్జిత సేవల ద్వారా స్వామివారికి సాలీనా రూ.7 కోట్ల ఆదాయం సమకూరుతోంది. భక్తులకు కనీస సమాచారం తెలిసేందుకు పూజలు వాటి ధరలు, సమయం తెలిపేందుకు కనీస బోర్డులు లేకపోవడం పరిపాలన తీరుకు నిదర్శనం. మరోవైపు అరకొరగా ఉన్న బోర్డులు కూడా కనీసం కనిపించకుండా ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు ఉండడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోచోట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ బోర్డు సైతం చినిగిపోయి ఉన్న దానిని సరిచేసేందుకు కూడా తీరికలేదని ఆలయ ఉద్యోగులపై మండిపడుతున్నారు. స్వామి వారి సన్నిధిలో ఆది, సోమవారం గర్భగుడి దర్శనాల రద్దు, ఇతర మాస శివరాత్రి సందర్భంగా నిర్వహించే అభిషేకం అన్న పూజల వివరాలు కూడా తాతల కాలం నాటి కాగితపు బోర్డులపై రాసి ఉంటే అది కాస్త చెడిపోయినప్పటికీ కూడా మాకేంటి అనే విధంగా ఆలయ అధికారులు వ్యవరిస్తున్న తీరు భక్తుల నుంచి విమర్శలు వ్యక్తం అతుతున్నాయి. రాజన్న ఆలయ అధికారులు చొరవచూపి సంబంధిత బోర్డులను ఏర్పాటు చేయడమే కాకుండా పూజలు వాటి సమయం వివరాలను కూడా స్పష్టంగా తెలుగు, ఇంగ్లిష్, హింది భాషల్లో ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రజావాణి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

కలెక్టరేట్, నవంబర్ 25 : సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించగా, అదనపు కలెక్టర్ భీమ్యానాయక్‌తో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆయా శాఖలకు కలిపి మొత్తం 110 దరఖాస్తులు వచ్చాయి. ఇక్కడ ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

ట్రైసైకిల్ ఇప్పించండి

వేములవాడ రూరల్ మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన దివ్యాంగుడు పొన్నం వీరయ్య తనకు ట్రై సైకిల్ ఇప్పించాలని సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి కోరాడు. స్పందించిన కలెక్టర్ వెంటనే జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజంను పిలిచి ట్రైసైకిల్ ఇవ్వాలని సూచించగా వీరయ్యకు ట్రైసైకిల్ అందజేశారు.

భూమి మార్పిడి చేయాలి

చందుర్తి మండలం సనుగుల గ్రామానికి చెందిన జి.గోపాల్ తన తండ్రి పేరిట ఉన్న భూమిని తన పేరిట చేయాలని కలెక్టర్‌ను కలిసి కోరాడు.

అనర్హులను తొలగించాలి

డీఎస్సీ 2024 హింది పండితుల నియామకంలో అనర్హులను తొలగించాలని ఇల్లంతకుంట మండలం దాచారం పొన్నం రాజు కలెక్టర్ సందీప్ కుమార్ ఝాను కలిసి ఫిర్యాదు చేశారు.

స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలి

సిరిసిల్ల–సిద్దిపేట ప్రధాన రహదారిలో జిల్లెల్ల హనుమాన్ గుడి వద్ద స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని జిల్లెల్ల, రామచంద్రాపూర్ గ్రామస్తులు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను కలిసి వినతిపత్రం అందించారు. కలెక్టర్ ఆర్ అండ్‌బీ అధికారులను పరిశీలనకు ఆదేశించారు. ఇక్కడ సీహెచ్ రాజయ్య, డీ సతీశ్, బీ మాధవ్ ఉన్నారు.

ప్రారంభించి పది నెలలైనా బిల్లులు రాలే..

- షాపింగ్ కాంప్లెక్స్ బిల్లులు చెల్లించండి
- గంభీరావుపేట పంచాయతీ ఎదుట పురుగుల మందు డబ్బాతో కాంట్రాక్టర్ నిరసన

గంభీరావుపేట, నవంబర్ 25: షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించి పది నెలలైనా బిల్లులు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ ఓ కాంట్రాక్టర్ పురుగుల మందు డబ్బాతో నిరసన తెలిపాడు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని గంభీరావుపేట మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ ఎదుట కాంట్రాక్టర్ కేశవరావు పురుగుల మందు డబ్బాతో బైఠాయించాడు. గ్రామ పంచాయతీ అదనపు షాపింగ్ కాంప్లెక్స్, పబ్లిక్ టాయిలెట్స్‌కు సంబంధించిన రూ.13లక్షల బిల్లులు మంజూరు చేయడంలో ఎంపీడీవో నిర్లక్ష్యం వహిస్తున్నారని వాపోయాడు. నిర్మాణం పూర్తిచేసిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ఈ ఏడాది జనవరి 30న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ప్రారంభించారని గుర్తు చేశాడు. గ్రామ పంచాయతీ జనరల్ ఫండ్‌లో రూ.పది లక్షల బ్యాలన్స్ ఉన్నా బిల్లులు మంజూరు చేయడంలో ఎంపీడీవో నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఈ విషయమై రెండు నెలల క్రితం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని తెలిపాడు. పంచాయతీ బ్యాలన్స్ నిధులు, పెండింగ్ బిల్లులపై ఉన్నతాధికారులు విచారణ చేసి మంజూరు చేయాలని మండల స్థాయి అధికారులను కలెక్టర్ ఆదేశించి 15రోజులు దాటినా ఫలితం లేదన్నారు. తనకు ఆత్మహత్యే శరణ్యమని కాంట్రాక్టర్ ఆవేదన వ్యక్తం చేశాడు.

గ్రామ పంచాయతీ ఎదుట పురుగుల మందు డబ్బాతో గుత్తేదారు కేశవరావు

మద్యం మత్తులో భార్య, అత్తపై రోకలితో దాడి

- ఇద్దరికి గాయాలు

వేములవాడ రూరల్, నవంబర్ 25 : వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లికి చెందిన మొగిలి రాములు ఆదివారం మద్యం మత్తులో అత్త, భార్యపై రోకలితో దాడి చేశాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన లంకదాచారి లచ్చవ్వ కూతురిని మర్రిపల్లికి చెందిన మొగిలి రాముకు ఇచ్చి వివాహం చేయగా మూడు సంవత్సరాల పాప ఉంది. మద్యానికి బానిపైన రాము తరచూ భార్య జలతో గొడవపడేవాడు. ఇదే క్రమంలో జల కొద్దిరోజులు తల్లిగారి ఇంటికివెళ్లి ఇటీవలే భర్త వద్దకు వచ్చింది. ఆదివారం జలను చూసేందుకు తల్లి లచ్చవ్వ వచ్చింది. దీంతో మద్యం మత్తులో ఉన్న రాము భార్య జల, అత్త లచ్చవ్వతో గొడవ పడ్డాడు. ఈ సమయంలో పక్కనే ఉన్న రోకలితో అత్త, భార్యపై దాడి చేయడంతో ఇద్దరికి తల భాగంలో తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఇద్దరిని 108లో కరీంనగర్‌కు తరలించి చికిత్స చేయించారు. ఇద్దరి ఫిర్యాదుతో వేములవాడ రూరల్ స్టేషన్‌లో పోలీసులు కేసు నమోదు చేశారు.

గాయపడ్డ లచ్చవ్వ

బాలికను వేధించిన కేసులో ఆరుగురికి ఏడాది జైలు

సిరిసిల్ల గాంధీ చౌక్, నవంబర్ 25: బాలికను వేధించిన కేసులో ఆరుగురు నిందితులకు ఏడాది జైలు శిక్షతోపాటు రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ సిరిసిల్ల జడ్జి ఎన్ ప్రేమలత సోమవారం తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. 12 ఏప్రిల్ 2018న తన దొమ్మటి ఆనంద్, గొల్లపలి శశి, పబ్బ రాజేశ్, గౌరవేని నాగరాజు, సయ్యద్ సోహెల్, బొమ్మాడి గణేశ్ తనను లైంగికంగా వేధిస్తున్నారని వేములవాడకు చెందిన ఓ బాలిక(16) స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ వెంకటస్వామి వారిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జీషీట్ దాఖలు చేయగా, ప్రాసిక్యూషన్ తరపున పీపీ పెంట శ్రీనివాస్ వాదించారు. కోర్టు మానిటరింగ్ కానిస్టేబుళ్లు నరేందర్, మహేందర్ 8మంది సాక్షులను ప్రవేశపెట్టారు. కేసు పుర్వాపరాలను పరిశీలించిన జడ్జి.. నేరం రుజువు కావడంతో నిందితులకు ఏడాది జైలు శిక్షతోపాటు తలా వెయ్యి రూపాయల జరిమానా విధించారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

సిరిసిల్ల టౌన్, నవంబర్ 25: ప్రజా సమస్యలు పరిష్కరించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకుడు ఎడపెల్లి బాబు మహారాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించినట్లు తెలిపారు. ప్రజలందరికీ కేజీ టూ పీజీ ఉచిత విద్య, నాణ్యమైన వైద్య సేవలు, ఉపాధి అవకాశాలు కల్పించాలని, తదితర డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ ఉల్లెందుల అరుణ్ మహారాజ్, కేసుగాని పరమేశ్వరి మహారాణి, బడే అమర్ మహారాజ్, భీమ్ ప్రకాశ్ మహారాజ్, కవ్వంపల్లి గోవర్ధన్ మహారాజ్, కుర్మ సురేశ్ మహారాజ్, కుడుకల మధు మహారాజ్, కుంటాల ప్రవీణ్ మహారాజ్, కుంటాల పోచయ్య మహారాజ్, తదితరులున్నారు.

జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో నిరసన తెలుపుతున్న ధర్మ సమాజ్ పార్టీ నాయకులు

అర్హులకు ఇందిరమ్మ ఇండ్లివ్వాలి

కలెక్టరేట్, నవంబర్ 25 : సిరిసిల్లలో అర్హులై ఉండి కూడా డబుల్ బెడ్ రూం ఇండ్లు రాని వారికి మొదటి ప్రాధాన్యతగా ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఇండ్లు రాని లబ్ధిదారులతో కలిసి సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేశ్, సీపీఎం సిరిసిల్ల పట్టణ కార్యదర్శి అన్నల్‌దాస్ గణేష్ మాట్లాడుతూ, ప్రభుత్వం స్పందించకపోతే దశల వారీగా ఆందోళనలు చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎర్రవెల్లి నాగరాజు, బెజుగం సురేశ్, సబ్బని చంద్రకాంత్, మోర తిరుపతి, నల్ల బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఎం పార్టీ నాయకులు, లబ్ధిదారులు

ప్రమాదకరంగా గుంత

వేములవాడ రూరల్, నవంబర్ 25 : వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి–నాగయ్యపల్లి రోడ్డులో పెద్ద గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. నిత్యం వేములవాడ నుంచి కోరుట్లకు వెళ్లే రహదారిలో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు చొరవ తీసుకొని గుంతలను పూడ్చాలని సోమవారం నాగయ్యపల్లి గ్రామస్తులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో రొండి లక్ష్మణ్, రొండి శేఖర్, దయ్యాల అంజయ్య, ఏముండ్ల నాగయ్య, గుంట కొమురయ్య, బండి కొండయ్య, మాసం విష్ణు తదితరులున్నారు.

మర్రిపల్లి రోడ్డు పై గుంత వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

పేద మహిళలకు చీరెల పంపిణీ

ముస్తాబాద్, నవంబర్ 25 : ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన చిట్నేని మాధవి వెంకటేశ్వరరావు తన కుమారుడు అభినవ్ పుట్టిన రోజు పురస్కరించుకుని సుమారు 150 మంది పేద మహిళలకు చీరెలు అందించారు. ఈ కార్యక్రమంలో చిట్నేని విద్యాసాగర్ రావు, చిట్నేని అంజన్‌రావు, మాజీ ఎంపీటీసీ శ్రీధర్, మాజీ సర్పంచ్ ఎల్లం, వేంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ బాలమల్లు కుంట రవి, రమేశ్, లక్ష్మణ్, నవీన్, నాయకులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయానికే 'గ్రీవెన్స్ డే'

తెలంగాణ చౌక్, నవంబర్ 25 : ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి ప్రతి ఫిర్యాదుపై బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం ఏర్పాటు చేశామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఇందులో భాగంగా స్వయంగా బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. సోమవారం 21 ఫిర్యాదులు స్వీకరించి ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్‌చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
BUSINESS OFFER
★సిబిల్ స్కోర్ పెంచబడును ఇంటి పై లోన్ / ఓపెన్ ప్లాట్ లోన్ / బిజినెస్ లోన్/పర్సనల్ లోన్ సంప్రదించండి: పెద్దపల్లి సెల్: 9346756075
NTK-325450

CHANGE OF NAME
I, ERALLA SAMPATH, S/o. KOMURAIAH, R/o. H.No. 11-2-385, Indiranagar, Godavarikhani,Ramagundam Mandal, Peddapalli dist, Telangana, have changed My name from SAMPATH AVUNURI to ERALLA SAMPATH,S/o. KOMURAIAH For all Purpose.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

ఒకరి మరణానికి కారణమైన వ్యక్తికి రిమాండ్

తెలంగాణ చౌక్, నవంబర్ 25: మద్యం తాగి ర్యాష్ డ్రైవింగ్ చేసి ఒకరి మరణానికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామంలోని కేసీఆర్‌నగర్‌కు చెందిన మహ్మద్ సిరాజ్ తన కుటుంబ సభ్యులతో ఈనెల 10న ఎల్లారెడ్డిపేట మండ లం గొల్లపల్లిలోని దర్గాను దర్శించుకొని తిరిగి బంధువుల ఊరైన చంద్రపేటకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఆటో నుంచి శబ్దం రాగా సిరిసిల్ల పట్టణంలోని కొత్తచెరువు వద్ద ఆపి చూస్తుండగా, కోనరావుపేట మండలం నిమ్మపల్లిలో ఉంటున్న రాజస్థాన్‌కు చెందిన కైలాష్‌రామ్ మద్యం తాగి మహ్మద్ సిరాజ్‌ను ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. ఈ నేపథ్యంలో కరీంనగర్‌లోని దవాఖానలో చికిత్స పొందుతూ ఈ నెల 18న మృతి చెందాడు. భార్య అఫ్రిన్ ఫిర్యాదు మేరకు కైలాష్ రామ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

శిశు మరణాల నివారణకు పటిష్ట చర్యలు

కలెక్టరేట్, నవంబర్ 25 : జిల్లాలోని ప్రభుత్వ దవాఖానల్లో శిశు మరణాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం రాత్రి సమీకృత కలెక్టరేట్‌లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులతో 2024–25 సంవత్సరంలో జిల్లా దవాఖానలో శిశు మరణాలపై రివ్యూ నిర్వహించారు. జిల్లా దవాఖానలో జరుగుతున్న ప్రసవాలు, ఇటీవల జరిగిన శిశు మరణానికి గల కారణాలను కేసుల వారీగా కలెక్టర్ ఆరా తీశారు. ఇక్కడ జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి ఎం.వసంతరావు, సంక్షేమాధికారి పీ లక్ష్మీరాజం, మెడికల్ సుపరింటెండెంట్లు పెంచలయ్య, లక్ష్మీనారాయణ, ప్రోగ్రాం అధికారులు, మెడికల్ ఆఫీసర్లు, అధికారులున్నారు.

కుటుంబ నియంత్రణపై అవగాహన

సిరిసిల్ల టౌన్/కలెక్టరేట్, నవంబర్ 25: కుటుంబ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో డీఎంహెచ్‌వో వసంతరావు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసెక్టమి ఆపరేషన్ ద్వారా పురుషులకు కోత, కుట్టులేని సురక్షిత పద్ధతిలో ఆపరేషన్ చేస్తామని తెలిపారు. ఈ ఆపరేషన్ వల్ల దాంపత్య జీవితానికి ఎటువంటి ఆటంకం ఉండదని సూచించారు. ఇక్కడ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రజిత, డాక్టర్ అంజలి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, వేములవాడ ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య, డాక్టర్ రాజగోపాల్‌రావు, తదితర వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

ముస్తాబాద్, నవంబర్ 25 : మండలంలోని గూడెం గ్రామ నిరుపేద పడిగె నర్సమ్మ అనారోగ్యానికి గురై ఇటీవల మరణించగా బాధిత కుటుంబ సభ్యులను ముదిరాజ్ సంక్షేమ సంఘం నాయకులు సోమవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు రూ. 5వేల నగదు అందించారు. ఇక్కడ మండలాధ్యక్షుడు పిట్ల రాంగోపాల్, మండల ముదిరాజ్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి షాడ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గొడుగు శంకర్, సంఘ నాయకులు సత్యనారాయణ, గూడెం ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గీస రాజు, దుద్దెడ రాజు, పెంటం శ్రీకాంత్, అశోక్, బాలకిషన్, మాజీ ఎంపీటీసీలు, పడిగె ఆంజనేయులు, కంచం నర్సింలు, పంజా శ్రీనివాస్, ప్రసాద్ ముదిరాజ్ సభ్యులున్నారు.

కార్యవర్గం ఎన్నిక

సిరిసిల్ల టౌన్, నవంబర్ 25: జిల్లా కేంద్రంలో సోమవారం జిల్లా సైకాలజిస్ట్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర అధ్యక్షుడిగా ఎలగొండ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా చొప్పదండి శ్రీనివాస్‌ను ఎన్నుకున్నట్లు రాష్ట్ర సైకాలజిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు మోత్కూరి రాంచందర్ రావు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సైకాలజిస్ట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పున్నం చందర్, తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా అనిల్

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 25: దుమాలకు చెందిన చకినాల అనిల్ తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు దుమాల ఎంప్లాయీస్ అసోషియేషన్ సభ్యులు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు వారు చెప్పారు. ఈ సందర్భంగా దుమాల గ